క్లుప్తంగా

అలరించిన నృత్య ప్రదర్శన



భరత నాట్యం చేస్తున్న చిన్నారి

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల సమీపంలో వెలసిన భోగేశ్వరాలయంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. జాగరణ సందర్భంగా తిరుపాడు గ్రామానికి చెందిన గూడ రమేష్ రెడ్డి, శోభల కుమార్తె కార్తీక ప్రదర్శించిన భరత నాట్యానికి భక్తులు మంత్రముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా కార్తీకను ఆలయ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో గణపతిం, గురు నవనీతం, భ్రమరాంబాష్టకం, తాండవ నృత్యకరి, భో..శంభో, చక్కని మా శివయ్య తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు.

వెలగని ఐమాక్స్ లైట్లు

కల్లూరు: గత వారం రోజులుగా కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో ఐమాక్స్ లైట్లు వెలగడం లేదని సీపీఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు కె.సుధాకరప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాత్రి సమయంలో ఆవుల మంద రోడ్డుపై తిరగడం వల్ల వాహనదారులకు కనపడక ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయని తెలిపారు. ఈ రోడ్డుపై మున్సిపల్ అధికారులు నిత్యం ప్రయాణిస్తుంటారని, అయినా సమస్యను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

డ్యాన్స్ స్పోర్ట్స్ చాంపియన్‌కు అభినందన

కర్నూలు కల్చరల్: పంజాబ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి డ్యాన్స్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరచిన సియానా డాల్సిని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ బుధవారం ఆయన చాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎడిపై పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సియానా డాల్సి జూనియర్ అండర్–14 విభాగంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని తృతీయ స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. విద్యార్థినిని ప్రోత్సహిస్తున్న తండ్రి సురేష్, తల్లి ఏంజెలీనా ప్రణీతకు అభినందనలు తెలిపారు.

పాత నేరస్తుడి అరెస్ట్

కర్నూలు(టౌన్): కర్నూలు నగరంలోని బుధవారపేటకు చెందిన జంట వెంకటేశ్వర్లు అలియాస్ జక్కోడు పాత నేరస్తుడు. దొంగతనాలు, డేకాయిట్ కేసుల్లో పలుమార్లు శిక్ష అనుభవించాడు. 1989 నుంచి నేరాలకు పాల్పడుతున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగాం పోలీసు స్టేషన్‌లలో ఆయనపై కేసులు నమోదై ఉన్నాయి. సీఆర్ నంబర్ 19/1999 రఘునాథపల్లి పోలీసు స్టేషన్‌కు సంబంధించిన కేసులో అరెస్టు చేయడంతో జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలయ్యాడు. అతనిపై మరిన్ని కేసులు ఉండటంతో కోర్టు ఆదేశాల మేరకు బుధవారం రఘునాథ పల్లి పోలీసు స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుళ్లు కుమార స్వామి, రాజేష్ బుధవారపేటలో ఉన్న వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకొని జనగామకు తరలించినట్లు మూడవ పట్టణ పోలీసులు వెల్లడించారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని తిరుమల నగర్‌లో ఓ ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయి. సోగనూరు గ్రామానికి చెందిన బాలకృష్ణారెడ్డి పట్టణంలో ఫర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తూ తిరుమల నగర్‌లో నివాసముంటున్నాడు. శివరాత్రిని పురస్కరించుకొని మంగళవారం కుటుంబ సభ్యులతో శ్రీశైలానికి వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని విషయం గుర్తించిన దొంగలు రాత్రి ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి, బీరువా తాళం ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. బుధవారం ఉదయం ఇంటి పక్కల వారు ఇంటి తాళం పగులగొట్టడాన్ని గమనించి విషయాన్ని శ్రీశైలంలో ఉన్న బాలకృష్ణారెడ్డికి సమాచారం అందించారు. పట్టణ పోలీసులకు సమాచారం అందించటంతో సాయంత్రం క్లూస్ టీం పోలీసులు వచ్చి ఇంట్లో చోరీ జరిగిన చోట వేలిముద్రలు సేకరించారు. ఇంట్లో ఉన్న ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. 40 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు బాలకృష్ణారెడ్డి తెలిపారు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు విచారిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

హాలహర్వి: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వీఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, మండల కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు, ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించారని మండిపడ్డారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ మార్చి 3న కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కృష్ణమూర్తి, రంగయ్య పాల్గొన్నారు.



భోగేశ్వరాలయంలో దర్శించుకునేందుకు వేచిఉన్న భక్తులు



కోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు



కాల్వబుగ్గ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుకాణాలు



భక్తులకు ఉచితంగా మందులను అందిస్తున్న దృశ్యం

సర్వం శివోహం

- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- ఉపవాసాలు ఆచరించి శివపార్వతులను దర్శించుకున్న భక్తులు
- రాత్రి భక్తశ్రద్ధలతో జాగరణ



కాల్వబుగ్గలో స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

గడివేముల: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని ఎర్రమల కొండలలో వెలసిన దుర్గాభోగేశ్వరాలయం శివనామ స్మరణతో మార్మోగింది. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భోగేశ్వర క్షేత్రంలో అర్చకులు శ్యాంసుందర్‌శర్మ, గిరినాథశర్మ భోగేశ్వరస్వామి వార్లకు బుధవారం ప్రాతఃకాల పూజలు, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు వైభవంగా జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆలయ ప్రాంగణంలోని పంచకోనేర్లలో భక్తులు స్నానమాచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ నాగార్జునరెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. గడివేముల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కిరణ్‌కుమార్, జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ, మండల ఆర్‌ఎంపీల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు సేవలందించారు. కాశినాయన, వీరశైవులు, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. రాత్రి భక్తుల కాలక్షేపం కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు

శోభాయమానం..బుగ్గరామేశ్వరం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. బుధవారం మహాశివరాత్రి జాగరణ సందర్భంగా కాల్వబుగ్గలో బుగ్గరామేశ్వర స్వామితో పాటు, కన్నమడకలలో బుగ్గ రామలింగేశ్వర స్వామి, గుమ్మితం తండాలో మల్లికార్జున స్వామి, నన్నూరులో నాగలింగేశ్వరస్వామి, ఉప్పలపాడులో బుగ్గరామేశ్వరస్వామి తదితర శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఉదయాన్నే పవిత్ర స్నానాలు చేసి ఉపవాసాలు ఆచరించి శివపార్వతులను దర్శించుకున్నారు. స్వాముల వారికి అభిషేకాలతో పాటు కొబ్బరికాయలు కొట్టి, నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

కాల్వబుగ్గ దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ గావించారు. అనాధిగా వస్తున్న సాంప్రదాయం ప్రకారం మంగళవారం రాత్రి కాల్వ గ్రామంలో ఉత్సవ విగ్రహాలను పవిత్ర జలంతో శుభ్రం చేసి, అర్చకులు కల్లె లక్ష్మినారాయణ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను కాల్వబుగ్గకు వరప్రయాణం గావించారు. వర ప్రయాణంలో భాగంగా స్వాముల వారి ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి మంగళవారం రాత్రి 10 గంటలకు బయలుదేరిన స్వాముల వారు బుధవారం ఉదయం 11 గంటలకు కాల్వబుగ్గ దేవస్థానానికి చేరుకున్నారు. అక్కడ ఆలయ గర్భగుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి, ఆలయ ప్రవేశం చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ గావించారు.

పటిష్ట బందోబస్తు మధ్య జాగరణ

బుధవారం రాత్రి సీఐ చంద్రబాబునాయుడు పర్యవేక్షణలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. భక్తుల కాలక్షేప నిమిత్తం, హైదరాబాద్ వారిచే భారీ ఎత్తున సినీ సంగీత విభావరి నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

వ్యాపార సముదాయాల కళకళ

వేర్వేరు ప్రాంతాల నుంచి పలు వ్యాపారాలు నిర్వహించేందుకు వచ్చిన వారితో ఆలయ పరిసరాలు కళకళలాడాయి. దాదాపు వారం రోజుల పాటు జరిగే ఉత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణలో దుకాణాలు ఏర్పాటు చేసి ఆటవస్తువులు, బొమ్మలు, గాజులు, మిఠాయిలు, పండ్లు, చెరకు గడలు, పలు రకాల తినుబండారాలను అందుబాటులో ఉంచారు. వారం రోజుల్లో రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతుందని వ్యాపారస్తులు భావిస్తున్నారు.

కోడుమూరు రూరల్: ఓం నమః శివాయ.. శివాయ నమః అంటూ భక్తులు శివయ్యను దర్శించుకుని పరవశించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాల్లోని శివాలయాల్లో బుధవారం పరమ శివునికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు చేశారు. లింగాష్టకాన్ని, శివ పంచాక్షరి మంత్రాన్ని జపించారు. ఉపవాసం ఉండి జాగరణ చేశారు. లింగోద్భవ ఘట్టం, శివపార్వతుల కల్యాణం, గ్రామోత్సవం, ప్రభోత్సవాలు శోభాయమానంగా జరిగాయి. ఈ వేడుకలను తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయాధికారులు అధికారులు, ఆలయాల కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కోడుమూరు పట్టణంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర దేవాలయంలో భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, కమిటీ సభ్యులు శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అలాగే శ్రీనీలకంఠేశ్వర దేవాలయం, కోటవీధి శ్రీభీమలింగేశ్వరస్వామి, గుంత శివాలయం, శ్రీకాళికామాతా దేవాలయం, ఈశ్వరాలయంలో భక్తులు శివుడికి అభిషేకాలు, పూజలు చేశారు.

– మండలంలోని వర్కూరులో వెలసిన శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా గ్రామస్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు. గురువారం తెలవారుజామున జరిగే శివపార్వతుల కల్యాణం కోసం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పుట్టమన్ను, తోరణాలు తెచ్చి పెండ్లి పందిరి వేశారు.

– గూడూరు మండలంలో శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. ఉదయం నుంచే ప్రజలు ముఖ్యంగా మహిళలు భారీగా దేవాలయాలకు చేరుకొని శివుడికి భక్తిశ్రద్ధలతో జలాభిషేకం, పాలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని చనుగొండ్ల గ్రామంలో వెలసిన శ్రీనాగలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామి వారికి భక్తులు విశేష పూజలు నిర్వహించి, జాగరణ సందర్భంగా స్వామిఅమ్మవార్లకు గ్రామస్తులు వైభవంగా కల్యాణం జరిపించి ప్రభోత్సవం నిర్వహించారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని కోట వీధిలో వెలసిన రాజరాజేశ్వరి దేవాలయంలో అభిషేకాలు, బస్టాండ్ ఆవరణలోని శివాలయంలో ఉత్సవ విగ్రహాలను, స్థానిక కొండ మీద వెలసిన గట్టు మల్లప్పకు పల్లకోత్సవం, నందికోలు గ్రామోత్సవ వైభవంగా నిర్వహించారు. గ్రామ శివారులోని అన్నప్ప స్వామి గుడికి పతాక ప్రతిష్టలతో పాటు జాగారణ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని కొత్తకోట, కె.సింగవరం, సంగాల, గుండ్రేవుల, ముడుమాల, కొండాపురం, కంబదహాల్, బురాన్‌దొడ్డి తదితర గ్రామాలలోని శివాలయాల్లో రాత్రి జాగారణ నిర్వహించారు. పోలకల్ గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీ చెన్న సోమేశ్వర స్వామి గుడి వద్ద భక్తులకు గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కమనీయం ఆదిదంపతుల కల్యాణం

సి.బెళగల్ బస్టాండ్ ఆవరణలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణం కనులు పండువగా జరిగింది. పురోహితులు సుదర్శణాచార్యుల సమక్షంలో సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు సీబీ గోవిందరెడ్డి, సీబీ వెంకటేశ్వరరెడ్డి సోదరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఎద్దుల బండిపై ఉంచి గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. కార్యక్రమాలలో సర్పంచ్ పాం దురంగన్న, జేసీఎస్ మండల కన్వీనర్ తులసిరెడ్డి, గ్రామ పెద్దలు, భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు శ్రీ మల్లికార్జునస్వామి, భ్రమరాంభదేవిల కళ్యాణంః

మహా శివరాత్రి సందర్భంగా గురువారం మండల కేంద్రం సి.బెళగల్ కొండపై వెలసిన శ్రీ గట్టు మల్లికార్జున, భ్రమరాంభదేవి కల్యాణం నిర్వహించటం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. గురువారం ఉదయం 10–45 గంటల నుంచి 11–15 గంటల మధ్య సాగే ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

కర్నూలు(రూరల్): హరహర శంభో శంకరా...ఓం నమఃశివాయ నామస్మరణ తో శివాలయాలు మార్మోగాయి. శివరాత్రిని పురస్కరించుకుని నిడ్జూరు గ్రామంలోని రామలింగేశ్వర ఆలయం, ఉల్చాలలోని వీరభద్ర ఆలయం, గార్గేయపురం గ్రామంలో ఈశ్వరుడు, రేమటాలో రామలింగేశ్వర స్వామి, పంచలింగాలలో పంచలింగేశ్వర స్వామి, ఈ తాండ్రపాడు గ్రామం నీలకంఠశ్వర, పసుపల గ్రామంలో శ్రీ చిందంబరేశ్వరస్వామి, బి.తాండ్రపాడులో భీమేశ్వర ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఉదయాన్నే శివుడిని దర్శించుకుని పూజ కార్యక్రమాలునిర్వహించారు.



పంచలింగాలలో పంచలింగేశ్వర స్వామికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు



కోడుమూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కోడుమూరులో ఓం శాంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలు



కోడుమూరు నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



సి.బెళగల్ బస్టాండ్ వద్ద శివాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న గ్రామ పెద్దలు



సి.బెళగల్ శివాలయంలో అమ్మవారి మంగళసూత్రాన్ని ప్రదర్శిస్తున్న పురోహితుడు



పాణికేశ్వరస్వామి మాలధారణలో శివస్వాములు



విద్యుదీపాల అలంకరణలో పాణికేశ్వరస్వామి ఆలయం



బృంగీశ్వర స్వామివారు



ప్రత్యేక అలంకరణలో పాణికేశ్వరస్వామి

మిన్నంటిన శివనామస్మరణ

పాణ్యం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. బుధవారం పండుగ సందర్భంగా ఆలయాలు విద్యుద్దీపాల కాంతులతో వెలిగిపోయాయి. తెల్లవారుజాము నుంచి స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పాణ్యంలోని శ్రీ పాణికేశ్వరస్వామి ఆలయంలో దేవదాయశాఖ అధికారులు, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, మహరుద్రాభిషేకం, పుష్పా అలంకరణ తదితర పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మొదటి సారిగా పాణికేశ్వర స్వామి మాల ధరించిన శివస్వాములు మహాశివ రాత్రి సందర్భంగా స్వామి వారికి పూజలు చేశారు.

– అలాగే పాణ్యంలోని బృంగీశ్వరస్వామి ఆలయం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది.

– అగస్తీశ్వరస్వామి ఆలయంలో భక్తుల తాకిడి కొనసాగింది. ఎర్రకొండల మధ్య వెలసిన ఈ ఆలయం శివరాత్రి శోభ సంతరించుకుంది.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు



విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్) ప్రాంగణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు వేగవంతం చేశారు. ఏడు అడుగుల ఈ విగ్రహాన్ని అమలాపురం నుంచి తెప్పించినట్లు విగ్రహ దాత, ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు తెలిపారు. బుధవారం విగ్రహం ఏర్పాటుకు సంబంధించిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి చివరి వారంలో ఈ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. విగ్రహం ఏర్పాటుకు దాదాపు రూ.4 లక్షల వరకు వ్యయం కానుందన్నారు. ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడులు ఎన్‌సీహెచ్ బజారన్న, ప్రధాన కార్యదర్శి నాయకల్లు సుంకన్న, ఉపాధ్యక్షుడు సుంకన్న, కోశాధికారి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వాహన డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తాం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ప్రభుత్వ వాహన డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను కోరారు. ఈయన ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన నేపథ్యంలో బుధవారం ఆయన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలుకు చెందిన వారు జాతీయ స్థాయి సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల నాగేశ్వరరావును అభినందించారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రభుత్వ వాహన డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు.వాటన్నింటినీ పరిష్కరిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారన్నారు. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి, కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

రేపు లక్ష పుష్పార్చన

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్య పురస్కరించుకుని లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. పుష్పార్చనలో పాల్గొనే భక్తులు (దంపతులకు) రవిక, స్వామి వారి ఫొటో, రెండు లడ్డూలు, దేవాలయం పేరున్న బ్యాగ్‌లో ఉంచి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో పాల్గొనేందుకు దంపతులు రూ.11,116 చెల్లించి ముందుగానే పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

హమాలీల సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): సివిల్ సప్లై గోదాముల్లో పని చేసే హమాలీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణ డిమాండ్ చేశారు. పెంచిన కూలీ రేట్లను అమలు చేయాలని కోరుతూ కర్నూలు ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద చేపట్టిన ఆందోళన కార్యక్రమం బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్ సప్లై హమాలీలకు ఇచ్చే కూలీని రూ.25 నుంచి రూ.28కు పెంచినట్లు ప్రకటించినా అమలు చేయడం లేదన్నారు. అలాగే రెండు జతల దుస్తులతోపాటు స్వీటు ప్యాకెట్, బోనస్ ఇవ్వాలన్నారు. హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు పీఎస్ రాధాకృష్ణ, రాజు, శివ, వినయ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆశ్రయం'పై అలుసు

- రైల్వే స్టేషన్, కొత్త బస్టాండ్ అడ్డాగా యాచకులు, నిరాశ్రయులు
- అలంకార ప్రాయంగా పట్టణ నిరాశ్రయుల వసతి గృహం
- అవగాహన కల్పించని అధికారులు
- నిధుల వృథా తప్పా.. నేరవేరని లక్ష్యం




పట్టణ నిరాశ్రయుల వసతి గృహం

కర్నూలు (టౌన్): నగరం స్మార్ట్ సిటీగా రూపాదిద్దుకుంటోంది. దినదినాభివృద్ధి చెందుతూ పరిధి పెంచుకుంటూ విస్తరిస్తోంది. 2002లో 67 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉన్న నగరం ఇప్పుడు 119 చదరపు కిలోమీటర్లకు చేరుకుంది. టౌన్ రైల్వేస్టేషన్ కాస్తా సిటీ రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చెందింది. అయితే నగరంలో ఎక్కడ పడితే అక్కడ యాచకులు పడుకోవడం, మహిళలు సైతం రాత్రి వేళల్లో రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై పడుకోవడం వంటివి ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో అవసరం ఉన్న చోట్ల పట్టణ నిరాశ్రయుల వసతి గృహాలను ఏర్పాటు చేస్తోంది. కర్నూలులో రైల్వే స్టేషన్ వద్ద పట్టణ నిరాశ్రయుల వసతి గృహం ఏర్పాటు చేసింది. నిరాశ్రయులు రాత్రి వేళ పడుకోవడం, ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడం, భోజనంతో పాటు ఇక్కడ సేద తీరవచ్చు. మంచాలు, టీవీ, ఫ్యాన్లు అన్ని ఉన్నాయి. స్వచ్ఛంద సంస్థలు వీటిని నిర్వహిస్తాయి. ప్రభుత్వం వీరికి డబ్బులు చెల్లిస్తుంది. అయితే ప్రభుత్వం అనుకున్న లక్ష్యం మాత్రం నేరవేరడం లేదు. నగరంలో రాత్రి వేళ రోడ్లపై ఎక్కడ చూసినా నిరాశ్రయులు దర్శనమిస్తున్నారు.

యాచకులకు అడ్డాగా రైల్వే స్టేషన్

కొత్త బస్టాండ్‌తో పాటు రైల్వే స్టేషన్ యాచకులకు, ఆశ్రయం లేని వారికి అడ్డాగా మారింది. నిరాశ్రయులు అక్కడి రోడ్ల మీద పడుకుంటున్నారు. కొన్ని సార్లు అసాంఘిక శక్తులతో మహిళలు ఇబ్బందులు పడిన సంఘటనలు ఉన్నాయి. ఇటీవల రైల్వే స్టేషన్ సమీపంలో అర్ధరాత్రి నిరాశ్రయుల మధ్య గొడవ జరిగి ఒక అనాథ మహిళను రాయితో కొట్టి చంపిన సంఘటన జరిగింది. గంజాయి ముసుగులో కొంత మంది ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారు. బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. మరి పట్టణ వసతి గృహాల నిర్వాహకులు ఏం చేస్తున్నారు? రోడ్లపై పడుకుంటున్న వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత వీరిపై ఉంది. అయినా పెద్దగా పట్టించుకున్న దాఖాలాలు లేవు. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తే ఇటువంటి సంఘటనలు పునరావృతం కావన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇక కొత్తబస్టాండ్‌లో ఇదే పరిస్థితి. అర్ధరాత్రి దాటితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. బస్సు దిగి ఆటో కోసం వేచి ఉన్న ప్రయాణికులను గంజాయి సేవించిన యాచకులు బెదిరిస్తున్నారు. బలవంతంగా డబ్బులు లాక్కుంటున్నారు. పోలీసులు గస్తీ తిరగడంతోపాటు రాత్రి వేళ భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. మెప్మా అధికారులు నిరాశ్రయులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి పట్టణ వసతి గృహాల గురించి వివరించాలి. అన్ని సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తున్నా నిరాశ్రయులు ఎందుకు రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వసతి గృహంలో మాత్రం ప్రతి రోజు నిధుల ఖర్చు చూపిస్తున్నారు. మెప్మా అధికారులు గుడ్డిగా సంతకాలు చేస్తున్నారు. అయితే అనుకున్న లక్ష్యం మాత్రం నేరవేరడం లేదు.

అలంకార ప్రాయంగా వసతి గృహం



రైల్వే స్టేషన్ సమీపంలోనే నిరాశ్రయుల వసతి గృహం ఉన్నా ఎలాంటి ఉపయోగం లేదు. యాచకులు, నిరాశ్రయులు రోడ్ల మీద పడుకుంటున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. స్థానికంగా అవగాహన కల్పిస్తున్నాం. మెప్మా ఆధ్వర్యంలో ఉన్న ఈ వసతి గృహంలో నిరాశ్రయులకు భోజనం, వసతి సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తారు. అయితే నిర్వాహకులు పట్టించుకోకపోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక ఈ ప్రాంతం యాచకులకు అడ్డాగా మారుతోంది. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

– నౌషాద్, సామాజిక కార్యకర్త, అశోక్ నగర్